క్లుప్తంగా

వెండి తొడుగుల వితరణ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో ఉన్న అమ్మవారికి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పత్తి సంతోష్ దంపతులు బుధవారం కిలో వెండి తొడుగులను వితరణ చేశారు. అదే విధంగా మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త ఉప్పు విఠల్ దంపతులు అర్ధ కిలో వెండి తొడుగులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అంతకు ముందు వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఈశ్వర్ రెడ్డి, సందీప్, మంచి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో చేర్పించాలి



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని ఇంటర్మీడియట్ అధికారులు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్ ప్రవేశాల పత్రాలను మండల అధికారులు, నాయకులు విడుదల చేశారు. జూనియర్ కళాశా లలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ మండల నాయకులు దుర్గారెడ్డి, గైని విఠల్, మనోహర్, అంజయ్య, వెంకటేశం, తహసీల్దార్ బిక్షపతి, ఎంపీడీవో నాగేశ్వర్, లెక్చరర్లు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పుల్కల్ పీహెచ్‌సీ డాక్టర్ మమత, ఆయుష్ వైద్యులు శ్రీప్రియా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చలి జ్వరం వస్తే వెంటనే వైద్యం చేయించుకోవాలని సూచించారు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా చూడాలని సీజనల్ వ్యాధుల నివారణ అధికారి రాణిని సూచించారు.

ఎల్‌వోసీ అందజేత



కామారెడ్డి క్రైం: దోమకొండకు చెందిన కానుగంటి రవి అనే వ్యక్తి అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన నిరుపేద కావడంతో ముందస్తు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.50 లక్షల విలువైన ఎల్‌వోసీని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ బుధవారం ఆయన నివాసంలో అందజేశారు.

ప్రమాద బీమా చెక్కు..



గాంధారి(ఎల్లారెడ్డి): ప్రమాదంలో మృతి చెందిన బాధితుడి కుమారుడికి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం తపాలాశాఖ నిజామాబాద్ డివిజన్ ఎస్ఎస్‌పీవోఎస్ అనిల్ కుమార్ రూ.10 లక్షల బీమా చెక్కును అందజేశారు. గ్రామానికి చెందిన నర్సింలు తపాలా శాఖలో పాలసీ చేశారు. ఆయన ఇటీవల ప్రమాదంలో మృతి చెందారు. పాలసీ నామినీ అయిన ఆయన కుమారుడు వినయ్‌కు బీమా చెక్కును అందజేశారు. స్థానిక సర్పంచ్ సంజీవు, ఎస్‌పీఎం రవీందర్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): దుర్గం, గుజ్జుల్ తండా, పిష్కిల్ గుట్ట తండాల్లో బుధవారం పర్యటించి క్షేత్రస్థాయిలో మొక్కజొన్న, వరి, సోయాబీన్ తదితర పంటలను పరిశీలించినట్లు ఏవో నరేష్ తెలిపారు. మొక్కజొన్న, వరిలో కాండం తొలిచే పురుగు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ పురుగుల నుంచి పంటలను రక్షించుకోడానికి సంబంధిత రైతులకు తగిన సూచనలు చేశామన్నారు. ఏఈవో కరుణేశ్వర్, రైతులున్నారు.

తాడ్కోల్ శివారులో..

బాన్సువాడ రూరల్: తాడ్కోల్ శివారులో బుధవారం మండల వ్యవసాయాధికారి సుధాకర్ పర్యటించారు. పంటలను పరిశీలించారు. వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశిస్తున్నట్లు గుర్తించారు. నివారణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఏఈవో గోపాల్, తదితరులు ఉన్నారు.



బీబీపేటలో..



మాచారెడ్డి: పాల్వంచ మర్రి వద్ద..



దోమకొండలో పాలాభిషేకం చేస్తున్న మహిళలు

గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపుపై హర్షం



భిక్కనూరులో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



జిల్లా కేంద్రంలో పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

- ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాలకు పలు చోట్ల పాలాభిషేకం

సాక్షి నెట్‌వర్క్: రాఖీ పండుగ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి గ్యాస్ సిలిండర్‌పై రూ.200 ఉజ్వల పథకం వాడే వారికి రూ.400 తగ్గించడాన్ని హర్షిస్తూ బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. పేదల కోసం అద్భుతమైన పథకాలను తెచ్చి, వారి అభివృద్ధి కోసం చేసే ప్రభుత్వం బీజేపీ ప్రభుత్వమేనని నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రేణుకా ఎల్లమ్మ గుడి నిర్మాణానికి స్పీకర్ భూమిపూజ



బాన్సువాడలో భూమి పూజ చేస్తున్న స్పీకర్ శ్రీనివాస్ రెడ్డి



వెంకంపల్లిలో.. జెడ్పీటీసీ, సర్పంచ్

బాన్సువాడ: పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీకి వెళ్లే దారిలో రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. రూ.25 లక్షల నిధులతో గుడి నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. ఆయన వెంట ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కౌన్సిలర్లు రమాదేవి, అంబర్‌సింగ్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్ నాయక్, ఎజాస్, శ్రీధర్, గౌడ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

జీపీ భవన నిర్మాణానికి..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వెంకంపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం స్థానిక సర్పంచ్ శుభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి దివ్య తదితరులు పాల్గొన్నారు.

కోటాల్‌పల్లిలో..

కామారెడ్డి రూరల్: కోటాల్‌పల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ ఉరుదొండ నరేష్, సర్పంచ్ జోనకంటి మంజుల, ఉపసర్పంచ్ రాజు, తదితరులు పాల్గొన్నారు

మున్నూరు కాపు సంఘం భవనానికి..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ బుధవారం భూమిపూజ చేశారు. పనులను నాణ్యతగా చేయాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. సంఘం నాయకులు సాయిరాములు, పోశెట్టి తదితరులున్నారు.



కోటాల్‌పల్లిలో.. ఎంపీపీ ఆంజనేయులు



ఎల్లారెడ్డిలో.. మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ

బీర్కూర్ మండల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



బాన్సువాడ: బీర్కూర్ మండల సమఖ్య కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. అధ్యక్షురాలిగా నా గమణి(తిమ్మాపూర్), ఉపాధ్యక్షురాలిగా గిరి లలిత(బైరాపూర్), ప్రధాన కార్యదర్శిగా గైని ద్రౌపది(బరంగ్‌గేడ్గి), సహాయ కార్యదర్శి వీర మణి(విఠలేశ్వర), కోశాధికారిగా పద్మ(దుర్గా భవాని)లను ఎన్నుకున్నారు.

సీసీ స్లాబ్ పనుల ప్రారంభం

రాజంపేట: రాజంపేట మండల పెద్దాయిపల్లి గ్రామంలో బుధవారం పెద్దమ్మ ఆలయం సీసీ స్లాబు పనులను కామారెడ్డి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడి ప్రారంభించారు. ముదిరాజ్ సంఘ సభ్యుల ఆహ్వానం మేరకు సీసీ స్లాబుల పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

తల్లిని కోల్పోయిన చిన్నారులకు దుస్తుల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారం గ్రామానికి చెందిన దాసరి భాగ్యలక్ష్మి(30) ఇటీవల నాగుల పంచమి రోజున అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమెకు భర్త సాయిలు, ఇద్దరు కుమారులు, 14 నెలల కుమార్తె ఉంది. వారు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఎల్లమ్మతండా ఇన్‌చార్జి సర్పంచ్ భీంరావు చిన్నారులకు బట్టలు, పాల డబ్బాలు, కాస్మోటిక్స్, నిత్యావసర వస్తువులు అందజేశారు.

'ఇంక్రిమెంట్ సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి'



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నేత కమలాకర్‌రావు

భిక్కనూరు: ఉపాధ్యాయులకు రావల్సిన నోషనల్ ఇంక్రిమెంట్ సాధన కోసం ప్రభుత్వంపై పీఆర్‌టీయూ ఒత్తిడి తెస్తోందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కమలాకర్‌రావు అన్నారు. బుధవారం ఆయన లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో మాట్లాడారు. పీఆర్‌టీయూ మాజీ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు రాంరెడ్డిని కలిసి ప్రత్యేక ఉపాధ్యాయుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమలాకర్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో రూ.398 వేతనంపై 17వేల మంది ప్రత్యేక ఉపాధ్యాయులుగా పనిచేశారని, వారిలో చాలా మంది పదవీ విరమణ పొందినప్పటికి వారికి రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్ ఇంత వరకు అందలేదని గుర్తు చేశారు. ఈ విషయమై ప్రభుత్వంపై పీఆర్‌టీయూ ఒత్తిడి తీసుకొస్తుందన్నారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు నూతన బీమా పాలసీని ప్రభుత్వం త్వరలోనే ప్రకటించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏనుగు బాపురెడ్డి, రాష్ట్ర బాధ్యులు మధుసూదన్‌రెడ్డి, జశ్వంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదాపై ఆగ్రహం



నిరసన తెలుపుతున్న సర్పంచ్ మహేందర్‌రెడ్డి

రామారెడ్డి: రామారెడ్డి మండల సర్వసభ్య సమావేశాన్ని రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా అధికార బీఆర్ఎస్ ఎంపీటీసీలు వాయిదా వేయమని కోరడం, ఎంపీపీ వాయిదా వేయడంపై పోసానిపేట సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నేలపై కూర్చుని నిరసన తెలిపారు. ముందే సభను వాయిదా వేస్తామని తెలిసి ఎందుకు సభ్యులకు సమాచారం ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులందరూ కుమ్మక్కై సభను వాయిదా వేయడం, సమావేశంలో చర్చకు రావలసిన సమస్యలను పక్కదోవ పట్టించడమేనని పోసానిపేట సర్పంచ్ మహేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి ఆరోపించారు. సభ్యుల కోరిక మేరకు వాయిదా వేశామని, తిరిగి సమావేశం సోమవారం నిర్వహిస్తామని తెలిపారు.

సమాచారం..

రేపు బాన్సువాడలో దివ్యాంగుల సదస్సు



బాన్సువాడ: పట్టణంలో శుక్రవారం దివ్యాంగుల జిల్లా సదస్సును నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల సమితి నేత గంగాధర్ చారి తెలిపారు. బుధవారం ఆయన బాన్సువాడలో మాట్లాడుతూ.. దివ్యాంగుల చట్టాలు, సంక్షేమ పథకాలు, సమస్యలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. నాయకులు గొల్ల గంగాధర్, సాయిలు, సురేష్, గోస్కే సాయిలు ఉన్నారు.

సెప్టెంబర్ 2న ఎల్లారెడ్డిలో జాబ్‌మేళా

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సెప్టెంబర్ 2న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ బుధవారం తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులైన యువతీ, యువకులకు మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలున్నాయని అన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌తో బీఆర్ఎస్, బీజేపీల్లో వణుకు



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న మద్దెల బాగయ్య

సదాశివనగర్(ఎల్లారెడ్డి): చేవెళ్లలో జరిగిన కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభలో ఏఐసీసీ, టీపీసీసీ నాయకులు విడుదల చేసిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను చూసి బీఆర్ఎస్, బీజేపీల్లో వణుకు పుడుతోందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి అనంతరం మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. సీఎం కేసీఆర్ చెప్పే మాయమాటలు ప్రజలు నమ్మొద్దన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు సంతోష్ పాటిల్, మండల ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, నాయకులు కోతి లింగారెడ్డి, రవినాయక్, గౌసొద్దీన్, జగ్గ బాల్‌రాజు పాల్గొన్నారు.

కొత్త మండలం ఏర్పాటు.. బీఆర్ఎస్‌లో చేరికలు

- జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు



కండువాలు కప్పుతున్న దఫేదార్ రాజు

నిజాంసాగర్(జుక్కల్): కొత్తగా మహమ్మద్‌నగర్ మండలం ఏర్పాటుతో ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరుతున్నారని జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. బుధవారం కొమలంచ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నేత పోతాగౌడ్‌తో పాటు పలువురు కార్యకర్తలు మాజీ జెడ్పీ చైర్మన్ రాజు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా దఫేదార్ రాజు మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సాదుల సత్యనారాయణ, సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, సర్పంచులు లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, సంగమేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఖర్గే, షబ్బీర్ చిత్రపటాలకు పాలాభిషేకం



భిక్కనూరులో పాలాభిషేకం చేస్తున్న దళితులు

భిక్కనూరు: చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించినందుకు గాను భిక్కనూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో దళితులు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు మాజీ మంత్రి షబ్బీర్‌అలీ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఎస్సీ ఎస్టీలను కాంగ్రెస్ పార్టీయే ఆదుకుంటుందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ తుడం జీవన్ అన్నారు. నేతలు దశరథం, చేపూరి రాజు, కొట్టని స్వామి, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలి

- ఆర్డీవో మన్నె ప్రభాకర్



బీఎల్‌వోలకు సూచనలిస్తున్న ఆర్డీవో

ఎల్లారెడ్డి: ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం సెప్టెంబర్ 2, 3 తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు, దీని కోసం యువకుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్, బీఎల్‌వోలకు సూచించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో మృతి చెందిన వారి పేర్లను డెత్ సర్టిఫికెట్ తీసుకుని తొలగించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పుల దరఖాస్తులు తీసుకోవాలని అన్నారు. ఎల్లారెడ్డి, లింగంపేట తహసీల్దార్లు సురేష్, సుధాకర్, బీఎల్‌వోలు తదితరులున్నారు.

ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి



పెద్దకొడప్‌గల్ రైతు వేదికలో బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్



మద్నూర్‌లో తహసీల్దార్‌లతో సమావేశమైన అదనపు కలెక్టర్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి ఇంటికి తిరుగుతూ ఓటు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిజాంసాగర్ అదనపు కలెక్టర్ మనూ చౌదరి, బీఎల్‌వోలకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మనూ చౌదరి పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్ల దాటిన యువతీ, యువకులు కొత్త ఓటు నమోదు చేసుకునేలా బీఎల్‌వోలు చూడాలన్నారు. తహసీల్దార్ దశరత్, నిజాంసాగర్ డీటీ నవీన్, నాయబ్ తహసీల్దార్ రవి కాంత్, గిర్దావర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో తహసీల్దార్లతో సమావేశం

మద్నూర్(జుక్కల్): ఓటర్లలో చైతన్యం నింపేందుకు కృషి చేసి ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ మను చౌదరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని తహసీల్దార్‌లతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ముగిసే వరకు ప్రతి బుధవారం మద్నూర్ తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్‌లతో సమావేశం ఉంటుందని అన్నారు.

వంద రోజులకు చేరుకున్న నిరసనలు



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు ధర్నాలు బుధవారం నాటికి వంద రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా మాట్లాడుతూ.. వంద రోజులుగా తాము నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు తమ సమస్యలను పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వారం రోజుల్లో ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంట్రాక్టు అధ్యాపకులు గంగా కిషన్, యాలాద్రి, రమాదేవి, నరసయ్య, నిరంజన్ శర్మ, వైశాలి, దిలీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): జల్దిపల్లి గ్రామానికి చెందిన తిగుళ్ల రమేశ్ వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ పొంది కోర్సు పూర్తి చేసుకున్నందుకు డైట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఇంపాక్ట్ ధ్రువ పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడారు. నవ భారత నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, ప్రజలకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే టికెట్‌కు ఎంపీపీ దరఖాస్తు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యే పదవికి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు నాగిరెడ్డిపేట ఎంపీపీ దివిటి రాజ్‌దాస్ బుధవారం హైదరాబాద్‌లోని టీడీపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసి దరఖాస్తును అందజేశారు.

స్పీకర్‌కు నాగారం గ్రామస్తుల మద్దతు

బాన్సువాడ/బాన్సువాడ రూరల్: బాన్సువాడ మండలం నాగారం గ్రామస్తులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ చేసిన తీర్మాన పత్రాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. తమ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన స్పీకర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. సర్పంచ్ రాచప్ప, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, సాయిలు ఉన్నారు.

కేసీఆర్‌కు దివ్యాంగుల మద్దతు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు తమ మద్దతు ఉంటుందని భారత జాగృతి దివ్యాంగుల విభాగం నాయకులు ప్రకటించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వికలాంగులకు రూ.4016 ఫించన్ ఇచ్చి ఆదుకుంటున్న కేసీఆర్‌ను గెలిపించుకుంటామన్నారు. నేతలు రాజన్న, మహేశ్ పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలి

కామారెడ్డి టౌన్: సమ్మె చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రాజనర్సు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు చేపడుతున్న సమ్మెలో మాట్లాడారు. ఏఎన్ఎంలను బెదింపులకు గురిచేయడం మానుకోవాలన్నారు.

అన్నదానం



భిక్కనూరు: మండల కేంద్రంలోని మహంకాళి ఆలయంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ఆశాఢ మాసంలో భక్తులు సమర్పించిన ఒడి బియ్యంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం పెద్ద ఎత్తున నిర్వహించారు. 4 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు.

స్వీపర్లను పట్టించుకోకపోవడం శోచనీయం

కామారెడ్డి రూరల్: పార్ట్‌టైం స్వీపర్ల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం కోరారు. బుధవారం స్వీపర్లు చేస్తున్న సమ్మె బుధవారం 66వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శివ్వంది సత్యం వారికి మద్దతు పలికి మాట్లాడారు. స్వీపర్లు బాలయ్య, శివలింగం, నారాయణ, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.